క్లుప్తంగా

పంటను నాశనం చేసిన దుండగులు



మొక్కజొన్న పంటను నరికేసిన దృశ్యం

పరిగి: మండలంలోని మోదా పంచాయతీ పరిధిలో ఉన్న కోనాపురం గ్రామానికి చెందిన రైతు తిరుమలేష్‌కు సంబంధించిన మొక్కజొన్న పంటను కొందరు నాశనం చేశారు. సోమవారం రాత్రి తిరుమలేష్‌కు చెందిన మొక్కజొన్న పొలంలో మద్యం తాగుతున్న కొందరిని వారించాడు. దీనికి ప్రతీకారంగానే మద్యం సేవించిన వ్యక్తులు రాత్రి సమయంలో మొక్కజొన్న పంటను ఇష్టానుసారంగా నరికేశారని బాధితుడు వాపోయాడు. అధికారులు తనకు న్యాయం చేయాలని కోరాడు.

15 లోపు పంట నమోదు చేయించండి



మొక్కజొన్న సాగు చేసిన రైతులకు సూచనలిస్తున్న ఏఓ

పరిగి: మండలంలో పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 15 లోపు పంటల వివరాలను ఈక్రాప్ బుకింగ్ ద్వారా నమోదు చేయాలని తహసీల్దారు హసీనా సుల్తానా తెలిపారు. మంగళవారం మండలంలోని పైడేటి, శీగిపల్లి గ్రామాల రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులతో పంట నమోదు ప్రక్రియతో పాటు 2024 ఖరీఫ్ పంట సాగు పంటకోత ప్రయోగాలపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. మొక్కజొన్న పంటకు ఆశిస్తున్న కత్తెర పురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విజయభారతి, ఏఈఓ లలిత, ఆర్బీకే సహాయకులు నరేంద్ర, సింధూ, అనసూయ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఘనంగా హారతులు



అలంకరణలో చోళమాంబదేవి

అమరాపురం: మండలంలో మారెమ్మదేవికి మంగళవారం భక్తులు హారతులు సమర్పించారు. హలుకూరు, వీరాపురం, పుల్లీకుంట, వలస, దేవగానపల్లి, నగోనపల్లి, తమ్మడేపల్లి గొల్లహట్టి, మద్దనకుంట, ఉదుగూరు, బంగారుపాళ్యం గ్రామాల్లో భక్తులు కలశాలను ఏర్పాటు చేసుకుని ఆయా గ్రామ వీధుల గుండా డప్పు వాయిద్యాలతో ఆలయం వరకూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టు ప్రదక్షిణ చేసి అమ్మవారికి హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చకులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి అభిషేకం చేశారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

- పశు వైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్



మల్లసముద్రంలో అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్, ఏడీ అమర్

రొళ్ల/మడకశిర రూరల్ : పెంపుడు జీవాలకు రోగాలు సోకకుండా రైతులు, కాపర్లు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్, మడకశిర డివిజన్ పశు వైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అమర్ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం రొళ్ల మండల పరిధిలోని మల్లసముద్రం, మడకశిర మండలం కల్లుమర్రిలో పంచాయతీలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ కృత్రిమ గర్భాధారణ కింద విదేశీ జాతుల ఆవులే కాకుండా మేలైన స్వదేశీ బ్రీడ్‌లను కూడా ఎంపిక చేసుకొనే అవకాశం ఉందన్నారు. అలాగే పశువులలో చూడి నిర్ధారణ, తిరిగి ఎదకు వస్తూ కట్టకుండా నిలిచిపోయినవి, పూర్తిగా ఎదకు రానివి వంటి సుమారు 32 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే 20 ఆవులకు నట్టల నివారణ మందులు వేశామన్నారు. అనంతరం కృత్రిమ గర్భాధారణ వలన కలిగే లాభాలను రైతులకు, ఏహెచ్ఏలకు ప్రత్యేకంగా వివరించారు.

విరాళాల సేకరణ

పెనుకొండ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక బీజేపీ నాయకులు మంగళవారం పట్టణంలో విరాళాలు సేకరించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శేఖర్, పెనుకొండ బీజేపీ సభ్యత్వ ఇన్‌చార్జ్ డాక్టర్ గోపినాథ్ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళుతూ విరాళాలు సేకరించారు.

లాభాలు పూయిస్తున్న మల్లెలు

- పెన్నానది ప్రాంతంలో అధికంగా పూల సాగు
- దళారులతో నష్టపోతున్నామంటున్న రైతులు



నల్లూరు గ్రామంలో మల్లె మొగ్గలు విడిపిస్తున్న రైతులు



విరబూసిన మల్లెలు

రొద్దం: రైతులకు మల్లెలు లాభాలు పూయిస్తున్నాయి. అధిక పెట్టుబడులు అవసరం లేకుండా ఏడాదిలో ఏడెనిమిది నెలలు పాటు నిరంతరం ఆదాయాన్ని అందిస్తుండటంతో అన్నదాతలు మల్లెల సాగుకు మొగ్గుచూపుతున్నారు.

ఎకరాకు 1600 మొక్కలు

రొద్దం మండలం పెన్నానది ఒడ్డునున్న పలువురు రైతులు మల్లె పూలు సాగు చేస్తున్నారు. కొత్తగా సాగు చేసిన తోట ఓసారి పూతకు వస్తే పదేళ్ల పాటు స్థిరమైన దిగుబడి ఇస్తుందని పూల రైతులు చెబుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో 1600 మొక్కలు పెంచవచ్చు. తొలుత గుంతలు తవ్వి ఒక్కో గుంతలో రెండేసి మొక్కలను నాటాలి. మొక్కనాటిన తర్వాత తగిన మోతాదులో ఎరువులు వేయాలి. మొక్కలకు అంటుకట్టిన ఏడాదిన్నర తర్వాత మొగ్గలు వస్తాయి. మొగ్గలు వచ్చే సమయంలో మందులు పిచికారీ చేయాలి. ఇందుకు ఎకరాకు రూ.16 వేలు వరకూ ఖర్చు అవుతుంది. పూలు పూయడం మొదలైన తరువాత పదేళ్ల పాటు మంచి దిగుబడి ఉంటుంది. మల్లె తోటలకు వారానికి ఒకసారి నీరుకడితే సరిపోతుంది. వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ కోతల వంటి సమస్యలు ఉన్నా మల్లె రైతులు ధీమాగానే ఉంటారు. మల్లెపూల సీజన్ మార్చి నెల నుంచి మొదలవుతుంది. తొలి మూడు మాసాలు ఒక కేజీ రూ.300 నుంచి రూ.500 వరకూ ధర పలుకుతుంది. పూలు కోయడానికి వచ్చే కూలీలకు మధ్యాహ్నం 2 వరకూ పనిచేస్తే రూ.200 కూలి చెల్లిస్తుంటారు. మండల పరిధిలోని నల్లూరు, ఆర్ కుర్లపల్లి, రొద్దకంపల్లి, సుబ్బరాయప్పకొట్టాల తదితర పెన్నానది ప్రాంతం రైతులు పూల సాగు చేస్తున్నారు. అయితే తాము పండించిన పూలకు తామే ధర నిర్ణయించే స్థితిలో లేకపోవడం బాధాకరమని పూల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పని దళారుల దోపిడీ

అన్ని మార్కెట్లలో ఉన్నట్లే పూల మార్కెట్‌లోనూ దళారుల దోపిడీ తప్పడం లేదు. రైతుల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. మార్కెట్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం మార్కెట్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



10 సెంట్ల స్థలంలో మల్లె పూలు సాగు చేశాము. కూలీలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు మొత్తం ఖర్చులు దాదాపు రూ.10 వేల దాకా వస్తుంది. వచ్చిన పంటకు మార్కెట్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం మార్కెట్ సౌకర్యం కల్పిస్తే పూల రైతులకు ఊరట లభిస్తుంది. ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీల ఖర్చులు పోను మార్కెట్‌లో రేట్లు ఉంటే లాభదాయకంగా ఉంటుంది. 10 బార్లు పూలు అమ్మితే రూ.1000 వస్తుంది.

– లక్ష్మీదేవి ,నల్లూరు

జీఓ నంబర్ 85 రద్దు చేయాలి

చిలమత్తూరు: జీ.ఓ నంబర్ 85 ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం పిలుపుమేరకు మండలంలోని పీహెచ్‌సీ వైద్యులు తొలిరోజు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మంగళవారం చిలమత్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఏపీపీహెచ్‌సీడీఏ జిల్లా అధ్యక్షుడు డా. పి రామకృష్ణ మాట్లాడుతూ 85 జీఓ వలన వైద్యుల మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోతోందన్నారు. తమ పీజీ అవకాశాలు తగ్గించడం అన్యాయమని, ప్రభుత్వం జీఓపై పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 16 నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తామన్నారు. రెండు నెలలుగా ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలను ఇచ్చినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డా.తేజశ్విని, డా.నికేష్, డా.హర్షమిత్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

రొద్దం: మండల పరిధిలోని బీదానిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రభాకర్ ఇంటిపై దాడి కేసులో టీడీపీ నాయకులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వలీబాషా తెలిపారు. సోమవారం నిమజ్జనం సమయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇంటి వద్ద టీడీపీ నాయకులు బాణాసంచా పేల్చే విషయంలో వివాదం జరిగింది. ప్రభాకర్ ఇంటిపై టీడీపీ నాయకులు దాడి చేసి ఇంటి అద్దాలు ధ్వంసం చేశారు. ఈ విషయంపై పలువురిపై బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



బాధితుడితో దాడి వివరాలు అడిగి తెలుసుకుంటున్న మాజీ మంత్రి శంకరనారాయణ

రొద్దం: మండల పరిధిలోని బీదానిపల్లిలో టీడీపీ మద్దతుదారులు వైఎస్సార్‌సీపీ నాయకుడు కురుబ ప్రభాకర్ ఇంటిపై రాళ్లతో దాడులు చేశారు. ఈ ఘటనపై ఆయన పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శంకరనారాయణ మంగళవారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడొద్దని.. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. టీడీపీ నాయకులు దాడులు చేయడం పద్ధతి కాదన్నారు. ఇలాంటి చర్యలు జరకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, పెనుకొండ మున్సిపాల్ చైర్మన్ ఉమర్‌ఫారుఖ్, పెనుకొండ ఎంపీపీ గీత, సర్పంచులు సోమిరెడ్డి, గంగాధర్, రామకృష్ణ, పరమేష్, మాజీ సింగిల్ విండో చైర్మన్లు మారుతీరెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యునికి పరామర్శ



పాతలింగప్పను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: మండలంలోని సింగేపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు పాతలింగప్పను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప మంగళవారం పరామర్శించారు. ఎంపీటీసీ సభ్యుడు పాతలింగప్ప ద్విచక్ర వాహనంపై నుంచి పడటంతో స్వల్పంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప సింగేపల్లి గ్రామంలో ఉన్న ఎంపీటీసీ సభ్యుడి నివాసానికి చేరుకుని పాతలింగప్పను పరామర్శించారు.

ప్రశాంతంగా వినాయక నిమజ్జనం



ముస్లిం మత పెద్దలతో సమావేశమైన డీఎస్పీ మహేష్

హిందూపురం అర్బన్: వినాయక నిమజ్జనం ప్రశాంతవాతావరణంలో నిర్వహించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎస్పీ కేవీ మహేష్ అన్నారు. ఇందులో భాగంగానే టూటౌన్ పోలీసుస్టేషనల్‌లో మంగళవారం ముస్లిం మత పెద్దలతో ఆయన సమావేశమయ్యారు. జామియా మసీదు ముతవల్లీ నూరుల్లా తమ తరఫున 400 వందల మందికి భోజన ఏర్పాట్లు చేస్తామన్నారు. తాగునీటిని కూడా అందిస్తామన్నారు. తాము కూడా ఉత్సవాల్లో పాల్గొని వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సీఐలు రాజగోపాల్‌నాయుడు, అబ్దుల్ కరీం తదితరులు పాల్గొన్నారు.

నేడు ముద్దిరెడ్డిపల్లిలో నిమజ్జనం

పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి, కొట్నూరులలో బుధవారం వినాయ విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. 15 వరకూ వినాయక విగ్రహాలు సమీపంలోని పెన్నానది సమీపంలో నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు

పెనుకొండ: నియోజకవర్గంలో పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి సవిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద నియోజకవర్గంలో రూ. 23.31 కోట్లతో 41.50 కిలోమీటర్ల మేరకు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నామన్నారు. 305 పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు సైతం అందాయన్నారు. పెనుకొండ మండలంలో రూ. 4.15 కోట్లతో 40 పనులు, 5.68 కి.మీ, పరిగి మండలంలో రూ. 4 కోట్లతో 9 కి.మీ, సోమందేపల్లిలో రూ. 4.37 కోట్లతో 8.41 కి.మీ, గోరంట్లలో రూ. 5.44 కోట్లతో 10.67 కి.మీ , రొద్దంలో రూ. 5.35 కోట్లతో 7.72 కి.మీటర్ల రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. రొద్దం కందుకూర్లపల్లి రోడ్డుకు రూ. 1.25 కోట్లు మంజూరయ్యాయన్నారు. పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంపౌండ్ పనులకు సైతం నిధులు విడుదలైనట్లు ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే 50 మంది మృతి

- వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక





హిందూపురం: ప్రకృతి వైపరీత్యాలు, వరదలు అత్యవర పరిస్థితుల్లో ప్రజలను అన్ని రకాలుగా ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. విజయవాడలో వరదలు, ప్రకృతి వైపరీత్యాలపై వాతావరణశాఖ, నీటిపారుదలశాఖ అధికారులు ప్రభుత్వానికి ముందస్తుగా హెచ్చరికలతో నివేదికలు ఇచ్చినా ముఖ్యమంత్రి చంద్రబాబు పెడచెవిన పెట్టడం బాధకరమన్నారు. కనీసం వరదల సమయంలో ప్రభుత్వం వెంటనే ప్రజలను అప్రమత్తం చేస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించి వారికి ఆహారం, తాగునీటి వసతులు కల్పించాల్సిందని, కానీ కూటమి ప్రభుత్వం అందులో కూడా ఘోరంగా విఫలమైందన్నారు. భారీ వర్షాలు, వరదలు వస్తాయని హెచ్చరికలున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టడం క్షమించరాని నేరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకు వరద నీరు వెలగలేరు రెగ్యులేటర్ నుంచి విజయవాడ దిక్కుకు వదిలేశారని విమర్శించారు. దీనివల్లనే భారీ నీటి ప్రవహంతో ఇంత ఘోరమైన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. వరదల కారణంగా 50 మంది మరణాలకు ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణే కారణమని చెప్పారు. రాష్ట్ర రాజధానిగా చెప్పేకునే విజయవాడలోనే ప్రభుత్వ వైఫల్యమైందని, మిగిలిన ప్రాంతాల్లో విపత్కర పరిస్థితులు సంభవిస్తే దారుణాలు చూడాల్సిందేనన్నారు. ముంపు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి బోటుల్లో తిరుగుతూ, మీడియాల్లో మాట్లాడుతూ దాన్ని కూడా తనకు అనుకూలంగా ప్రచారానికి వాడుకున్నారని ధ్వజమెత్తారు. వరదల్లో ఇల్లు కొల్పోయిన బాధితులకు ప్రభుత్వామే ఇల్లు నిర్మించి అన్నిరకాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరదల్లో మృతిచెందిన బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇచ్చి సదుపాయలు కల్పించాలన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న హిందీ సబ్జెక్టుకు అధ్యాపక పోస్టు భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు. అతిథి అధ్యాపక పోస్టుకు ఎంఏ హిందీలో 50 శాతం అంతకంటే ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 12న ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

మహా గణపతిం భజే..

గణేష్ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం వివిధ ప్రాంతాల్లో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు. హిందూపురం, తదితర ప్రాంతాల్లో గణపతి మంటపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగానే పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

–సాక్షిబృందం:



చౌడేశ్వరకాలనీలో బొజ్జ గణపయ్య



షిర్డి వినాయక సేవాసమితి ఆధ్వర్యంలో గదతో లంబోదరుడు



ముక్కిడిపేటలోని కుర్మవాహన మహాగణపతి



పావగడ: వినాయకుడిని ఊరేగిస్తున్న దృశ్యం



పరిగి మండలం కొడిగెనహళ్లిలో నిమజ్జనానికి తరలుతున్న గణేష్ విగ్రహం



త్యాగరాజనగర్‌లో మహారాజ రూపంలో గణేషుడు



హనుమాన్ భుజంపై పార్వతీతనయుడు



ముద్దిరెడ్డిపల్లిలో భక్తజన గణాధిపతి



లేపాక్షి: రాజీవ్‌కాలనీలో వినాయకుడిని ఊరేగిస్తున్న భక్తులు



సూర్యచంద్ర హనుమాన్ మహాగణపతి



లేపాక్షిలోని ఎస్సీ కాలనీలో కొలువుదీరిన లంబోదరుడు



కాబుల్ శనగవిత్తనాల అలంకరణలో వినాయకుడు

సంక్షిప్త సమాచారం

17 నుంచి క్రీడా పోటీలు

పరిగి: మండలంలో ఈనెల 17, 18 తేదీల్లో ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ పోటీలపై ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 17, 18 తేదీల్లో పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభావంతులను వెలికితీయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ వెంకటేష్, హెచ్ఎం కృపా సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు

పావగడ: కర్పూరి ఠాకూర్ వెనుక బడిన వర్గాల సంఘటన తుమకూరు జిల్లా విభాగం అధ్యక్షుడిగా మంగళవాడ ఎస్ నాగరాజు ఎంపికయ్యారు. సవితా సమాజం (నాయీ బ్రాహ్మణ) సంఘటనలో నిస్వార్థంగా సేవలందించిన నాగరాజు సేవలను గుర్తించి జిల్లా అధ్యక్షుడి బాధ్యతలు అప్పగించామని ఆ సంఘం అధ్యక్షుడు రఘువీర్ సింగ్, ఉపాధ్యక్షుడు ఆనంద వారిక కల్బుర్గి తెలిపారు.

డిజిటల్ గ్రంథాలయం ప్రారంభం

పావగడ: తాలూకాలోని దొమ్మతమరి గ్రామంలో డిజిటల్ గ్రంథాలయ కార్యాలయాన్ని ఎమ్మెల్యే వెంకటేశ్ మంగళవారం ప్రారంభించారు. అదే విధంగా మైనారిటీ కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, చరండి నిర్మాణపు పనులకు భూమి పూజ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామాంజినప్ప, గ్రా. పం అధ్యక్షురాలు గంగమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కన్మేడి గ్రామంలో రూ 50 లక్షలు, సీకే పుర గ్రామంలో రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల నిరసన

హిందూపురం టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 6వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు రోడ్డుపై బైఠాయించిన నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ కార్మికులకు బకాయి పడ్డ వేతనాలు చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని, ఇచ్చే అరకొర వేతనాలు నెల నెల ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ దీనిపై హామీ ఇచ్చినా ఇప్పటి వరకూ జీతాలు అందలేదని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాము, పోరాట కమిటీ కార్యదర్శి నాగేంద్ర, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జోతమ్మ వారికి మద్దతు పలికారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్టులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. మంగళవారం రాత్రి కోడూరు వైపు నుంచి టెక్స్‌పోర్ట్ గార్మెంట్స్ సూపర్‌వైజర్ హరి ద్విచక్ర వాహనంపై వస్తూ కొడికొండ చెక్‌పోస్టులో రోడ్డు దాటుతున్న కదిరప్ప(75)ను ఢీకొన్నాడు. ప్రమాదంలో కదిరప్ప కాలు విరిగిపోగా, హరికుమార్‌కు తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జూదరుల అరెస్ట్

చిలమత్తూరు: మండలంలోని మరవకొత్తపల్లి గ్రామ సమీపంలో పొలాల్లో ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5,160 నగదు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.